క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



ఆదర్శ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ శివప్రకాష్ రెడ్డి

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి సోమవారం పుల్లంపేటలోని ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే ఆయన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, ఎంఈఓ నాగా తిరుమలరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కనీస కూలీ వచ్చేలా పని చేయాలి



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ మద్దిలేటి

రాయచోటి టౌన్ : జాతీయ ఉపాధి హామీ పనులలో కనీసం రూ.272ల కూలీ లభించేలా పని చేయించాలని జిల్లా నీటి యజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని పెమ్మాడపల్లె, దిగువ అబ్బవరం గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పనులను ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కరువు పరిస్థితులలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎక్కడా అవినీతికి తావు ఇవ్వకూడదన్నారు. ఆయన వెంట దిగువ అబ్బవరం, పెమ్మాడపల్లె గ్రామాలకు చెందిన క్షేత్రస్థాయి, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.

బస్ స్టేషన్‌కు భూమిపూజ



బస్ స్టేషన్‌కు భూమిపూజ చేస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల కేంద్రంలోని బైపాస్‌లో బస్టాండ్ లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుల్లంపేట సచివాలయాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్ రెడ్డి, ఎం.శంకర్ రెడ్డి, మడగలం శ్రీను, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, బోగా పార్థసారథి, బికె మణి, వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీలోని బీడవాండ్లపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ తరఫున నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో ఎంపీపీ జనార్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మురళీధర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, రాచపల్లి సింగిల్ విండో అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, రాచపల్లె అధ్యక్షులు వెంకటరెడ్డి, గ్రామ మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటశివారెడ్డి,రామాంజులరెడ్డి, ధర్మారెడ్డి, ఓబుల్‌రెడ్డి, మల్లినాయుడు, కదిరయ్య రాజు, అనిల్‌కుమార్‌నాయుడు, యోగాంజుల రెడ్డిలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పట్టం కట్టండి

- ప్రచారంలో శ్రీకాంత్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టిన మైనార్టీలు



మైనార్టీలతో కలసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని రంగీస్‌షావలి సయ్యద్ యూసుఫ్ ఖాదరి బండ్లపెంట దర్గాలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మి థియేటర్ వెనుక భాగంలోని వీధులు, కొత్తపల్లెతోపాటు మహబూబ్ నగర్, జెండావీధి, కుక్కల వీధి, ముల్లా ఉస్మాన్ నగర్, గౌస్ మసీదు వీధి, జబ్బార్ స్కూల్ వీధులలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ఆయన ప్రజలకు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ హయాంలో పట్టణ ప్రజల నీటి సమస్యను తీర్చామని, రింగురోడ్డు, విద్యా సంస్థలు, మైనార్టీ హాస్టళ్ల ఏర్పాటుకు కృషి చేశామన్నారు. జగన్ హయాంలో జిల్లా కేంద్రం ఏర్పాటుతో రాయచోటి దశాదిశ మార్చామన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు నిండు మనస్సుతో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలంటూ కోరారు.

ద్వాక్రా మహిళలకు చంద్రబాబు టోకరా

ద్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని 2014లో హామీ ఇచ్చిన చంద్రబాబు ద్వాక్రా మహిళలను నమ్మించి మోసం చేశారన్నారు. రుణాలు మాఫీ చేయకపోగా సున్నా వడ్డీని సైతం ఎత్తివేసి మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని తెలిసి మహిళలను మరోసారి వెన్నుపోటు పొడిచేందుకు వివిధ పథకాలను ఇస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళల సాధికారతకు, ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని తెలియజేశారు.

వైఎస్‌ఆర్ కుటుంబానికి అండగా ఉంటాం

స్వర్గీయ వైఎస్‌ఆర్ కుటుంబానికి తాము అండగా ఉంటామని పట్టణంలోని కొత్తపల్లె ప్రాంత మైనార్టీలు అన్నారు. ఎన్నికల్లో తాము ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు ఓట్లు వేసి గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు హబీబుల్లాఖాన్, తబ్రేజ్‌ఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, అలీ నవాజ్‌ఖాన్, కొలిమి హారూన్, సాదక్‌అలీ, షబ్బీర్, రియాజుర్, జాకీర్, ఆసిఫ్‌అలీ, రిజ్వాన్, గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, రియాజ్, జానం రవీంద్ర, ఈశ్వర్‌ప్రసాద్, శ్యామ్‌కుమార్, అల్తాఫ్, రౌనఖ్, ఫయాజ్ అహమ్మద్, ఇర్ఫాన్, అబుజర్, నవాజ్, ఆనందరెడ్డి, నవరంగ్ నిస్సార్, ఇమ్రాన్, ఇర్షాద్, పల్లపు రమేష్, గువ్వల బుజ్జిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతరలో ఆకర్షణగా బండలాగుడు పోటీలు

లక్కిరెడ్డిపల్లె : గంగమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డితో కలిసి సోమవారం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు, తృతీయ బహుమతి రూ. 40 వేలు నగదును ఎమ్మెల్యే ప్రదానం చేశారు. కార్యక్రమంలో బండలాగుడు పోటీ నిర్వాహకులు గంగిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పట్టణంలో ప్రశాంతత

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం, శాంతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా బండ్ల పెంటలోని మదరసాలో ప్రత్యేక పూజలు అనంతరం మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా మార్చి అన్ని రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేశామన్నారు. రాయచోటి పట్టణానికి శాశ్వత తాగునీటిని అందించేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. ఈ క్రమంలో రెండేళ్లలో రూ. 100 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణపు పనులను పూర్తి చేయిస్తామన్నారు. రూ. 190 కోట్ల నిధులతో పీజీ కేంద్రం, ఆపై యూనివర్సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి వెలిగల్లు నీటిని అందించి తీరుతామన్నారు. పట్టణ పేదల కోసం ఆరు వేల ఇళ్లతో నిర్మితమవుతున్న నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. అభివృద్ధే తమ ధ్యేయంగా ప్రజల ముందుకు వెళ్తున్నామన్నారు. అన్ని వర్గాలకు సీఎం జగన్ మేలు చేసినందుకు 175 స్థానాలలో ఒంటరిగా పోటీ చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీలు ఏకమైనా ప్రజల అండదండలు జగనన్నకు ఉన్నంతవరకు ఎవరూ ఏమి చేయలేరన్నారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రతి ఒక్కరూ గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని శ్రీకాంత్‌రెడ్డి అభ్యర్థించారు. జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం పేర్కొన్నారు. ప్రజా రంజకంగా జగన్ పాలన సాగిందన్నారు. మరోమారు వైఎస్సార్‌సీపీని ప్రజలందరూ ఆదరించి, ఆశీర్వదించాలని ఆమె కోరారు.

విద్యకు పెద్దపీట

రాయచోటి టౌన్ : విద్యకు పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు గదులను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌తో కలసి ప్రారంభించారు.

ఆలయ నిర్మాణ స్థలం పరిశీలన



ఆలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట పంచాయతీలో 80 సెంట్లలో అయ్యప్ప ఆలయాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఆలయ నిర్మాణం జరిగే స్థలాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డిలు పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఆలయ నిర్మాణానికి అడిగిన వెంటనే స్థలం ఇచ్చేలా చేసినందుకు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, విప్ కొరముట్లకు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని సచివాలయం

సిద్దవటం : మాధవరం-1 గ్రామ పంచాయతీలోని సచివాలయం-2 సోమవారం తెరుచుకోకపోవడంతో సమస్యల కోసం వచ్చిన లబ్ధిదారులు అవస్థలుపడ్డారు. గ్రామాల్లోని సమస్యలకు అక్కడే పరిష్కారం చూపాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తెచ్చారు. ఇది ఇలా ఉండగా సోమవారం గ్రామ సచివాలయం-2 మూతపడింది. దీంతో అర్జీలను సచివాలయం అందించాలని వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై సచివాలయ డీడీఓ లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా తాను గ్రామ సచివాలయం - 1లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నానని, సచివాలయం - 2 ఎందుకు తెరవలేదో తనకు సమాచారం లేదన్నారు. విధి నిర్వహణలో కొంతమంది సిబ్బంది ఫీల్డ్ వర్క్‌కు వెళ్లారని, పంచాయతీ కార్యదర్శి సుజాత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని, ఇక మీదట పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన అన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలోని చింతకాయపల్లె గ్రామంలో వెలసిన బోడ మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా సోమవారం మాజీ సర్పంచ్ గంగి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేని స్థానికులు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృషభాలను చూసేందుకు, పోటీలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు వచ్చారు. పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, చింతకాయల ఎల్లయ్య, ట్రాక్టర్ సుబ్బన్న, మీసాల ఎల్లయ్య, రమణ, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండలో ఉన్న గోల్డెన్ స్ప్రింగ్ స్కూల్(ఆర్‌ఆర్‌యూపీ)కు చెందిన విద్యార్థులు అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో ప్రతిభచాటారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన మరియమ్ (5వ తరగతి), ఎస్. సారా(4వ తరగతి), సయ్యద్ హీబా(9వ తరగతి)లు ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచారు.

నీటి సమస్య పరిష్కారం



ట్యాంకర్లతో తాగునీరు అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెలో ఏర్పడిన తాగునీటి సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.శ్రీనివాసులు రెడ్డి పరిష్కరించారు. ప్రజలకు ఉచితంగా ట్యాంకర్లతో నీరు అందించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి



చేయూత మెగా చెక్కును అందజేస్తున్న అజయ్ రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వైఎస్సార్ చేయూత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మల భవిష్యత్తు బాగుండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేయూత, ఆసరా, సున్నా వడ్డీ లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం జగన్ సంకల్పమని తెలియజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కొరముట్లను, ఎంపీగా మిథున్ రెడ్డిని గెలిపించుకొని మరోసారి జగనన్నను సీఎంను చేసుకుందామని పేర్కొన్నారు. మండలానికి చేయూత కింద రూ. 3.30 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ కేతా చక్రపాణి, గుండ్లూరు ఈశ్వరయ్య, ఏపీఎం నిరంజన్, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, వెంకటరెడ్డిలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలిలో పోలీసు కవాతు

చిట్వేలి : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు చిట్వేలి మండల పరిసర ప్రాంతాలలో సోమవారం కేంద్ర, పోలీస్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మండల కేంద్రంలోని బ్రిడ్జి నుంచి ఎస్.అగ్రహారం వరకు రైల్వేకోడూరు సీఐ సురేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో పారా మిలిటరీ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్ఐ మురళీ, సిబ్బంది, కేంద్ర బలగాలు తదితరులు పాల్గొన్నారు.

మహా నైవేద్య ఘట్టానికి వేళాయె!

- భారీ సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీ, అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

రాయచోటి టౌన్ : మహా నైవేద్య ఘట్టానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం (నేడు) అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం రాయచోటి పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో జరుగనుంది. ఈ ఘట్టాన్ని కళ్లారా చూడాలని ఇతరా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం చేయాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహానైవేద్యం అంటే ..

స్వామి వారికి రోజుకొక సేరు బియ్యం చొప్పున సంవత్సరానికి 365 రోజులకు గాను 365 సేర్ల బియ్యంతో సుండుపల్లెకు చెందిన భక్తులు (సాంప్రదాయబద్ధంగా హక్కుగా లభించిన) వారు భోజనంతోపాటు దుంపలు, కాయగూరలు, ఆకుకూరలతో కూరలు వండుతారు. వీటితోపాటు నెలకు సేరు చొప్పున 12 నెలలకు కావాల్సిన బియ్యంతో అత్తిరాసాలు వండి అన్నంపై రాశిగా పోస్తారు. తరువాత స్వామి వారికి త్రినేత్రం ధరింప చేయడం. ఆ సమయంలో కన్నడ భక్తులు హాకారాలతో నిర్వహించే నృత్యాలతో స్వామి వారి కన్ను అన్నం రాశిపై పడటంతో అదును చూసుకొని రాశిపై (ఆనవాయితీగా వస్తున్న) దుమికి ప్రసాదాన్ని దోచుకెళతారు.

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు బస చేయడానికి వసతి సౌకర్యంతోపాటు వచ్చిన భక్తులకు మూడు పూటల భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. వాహనాల పార్కింగ్‌కు వరిగ రోడ్డులో 15 ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

రాయచోటి అర్బన్ : మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష అన్నారు. సోమవారం మున్సిపల్ సభా భవనంలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్‌రహిమాన్, సభ్యులు అల్తాఫ్, సుగవాసి ఈశ్వర్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు సలీంలు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో నామినేషన్ పద్ధతిలో చేపట్టవలసిన పనులను వర్క్స్ కమిటీ సభ్యులతో చర్చించిన తర్వాతనే చేపట్టాలన్నారు. అలా కాకుండా అధికారులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారంటూ వారు మండిపడ్డారు. ఇందుకు చైర్మన్ స్పందిస్తూ ఇక ముందు చేపట్టబోయే పనులన్నింటిని వర్క్స్ కమిటీ సభ్యుల పరిశీలన అయ్యాకే చేపట్టేలా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలపై సభలో చర్చ జరిపారు. అనంతరం చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ మంగళవారం నుంచి రంజాన్ ఉపవాసాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పట్టణంలో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, వీధిలైట్లు సక్రమంగా వెలగేలా చూడడం, సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయం

నందలూరు(రాజంపేట): స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయమని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి అన్నారు. రాజంపేట నియోజకవర్గ పరిధిలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. కాగా సోమవారం మండలంలోని పాటూరు పంచాయతీలో ఎస్ఎస్‌బీ డీఎస్పీ రామ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులతో కవాతు నిర్వహించి ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వేదిక్ మ్యాథ్స్‌కు విద్యార్థిని

నందలూరు(రాజంపేట): వేదిక్ మాథ్స్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో స్థానిక జ్ఞాన దీప్తి పాఠశాల విద్యార్థిని ఆకుల చరిత ఛాంపియన్‌గా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీలలో పాల్గొని రాణించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ జానకినాథ్, ప్రిన్సిపాల్ కసుపు లక్ష్మమ్మల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమెరికా నవమి ఉత్సవాలకు ఒంటిమిట్ట పట్టువస్త్రాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని స్వామి వారి ఆశీస్సులు పొందిన పట్టువస్త్రాలను సోమవారం మండల పరిధిలోని సాలాబాద్‌కు చెందిన ఎన్‌ఆర్ఐ ముమ్మడి పాపిరెడ్డిగారి వెంకట సుబ్బారెడ్డి, ఆయన సతీమణి భానుశ్రీ, వారి కుటుంబ సభ్యులు అమెరికాలోని చికాగోలో జరగబోవు శ్రీరామనవమి ఉత్సవాలకు పంపించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించారు. వారు తీసుకొచ్చిన పట్టువస్త్రాలను గర్భాలయంలోని మూల మూర్తులకు వేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలను వెంకట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకట సుబ్బారెడ్డి తల్లిదండ్రులు మల్లారెడ్డి, లలితమ్మ, ఆయన స్నేహితులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సుపోషిత భారతదేశం

చిట్వేలి : అన్నిశాఖల సమన్వయంతోనే పౌష్టికాహారంతో కూడిన సుపోషిత భారతదేశం సాధ్యమవుతుందని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రారంభం కార్యక్రమం, సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నా, చదువు సక్రమంగా సాగాలన్నా మంచి పౌష్టికాహారం, మితాహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్‌వైజర్ విజయకుమారి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రేడ్ - 1 సూపర్‌వైజర్ వసుందరమ్మ, గ్రేడ్ - 2 సూపర్‌వైజర్ సురేఖ రాణి, అంగన్‌వాడీ వర్కర్లు సుజాత, సుధామణి, సృజన, మాధవిలత, శ్రీదేవి, శాంతమ్మ, శ్యామల, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జీసీడీఓ జి.రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.